

# దొంగ అట్లు

"ఏవిటీ నేను విన్నది నిజమేనా?" ఒకరోజు పొద్దున్నే నిలదీసింది అమ్మమ్మ.

"ఏం విన్నావో చెప్తే నిజమో కాదో నేను చెప్తా" అన్నారు తాతయ్య.

"మన నరసమ్మచేత అట్ల దుకాణం పెట్టించారుట కదా?"

"అవును. నిజమే."

"హవ్వ. అనాచారం కదూ! ఇక ఈ బస్తీ పోకడలన్నీ అలవాటయితే ఇంకేమైనా ఉందా? అసలే నిప్పుకడిగి నీళ్ళు తాగేవాళ్ళున్న ఊళ్ళో అట్లూ ఆవడలూ అమ్మిస్తే ఉన్న పద్ధతి కాస్తా గంగలో కలిసిపోదూ!" లబలబలాడింది అమ్మమ్మ.

"ఏం చెయ్యమంటావు? దాని గతి అధోగతి అయిపోయింది. కట్టుకున్నవాడు కాలం చెల్లిపోయినా అత్తామామలు భద్రంగా ఉన్నారు. నలుగురు పిల్లలూ, మరిదీ. ఈ సంసారం ఈడవడం నావల్ల కాదు మామయ్యా, ఏ బాపట్లో, రేపల్లో పోయి పూటకూళ్ళ ఇల్లు నడుపుకుంటాను అని ఏడిచింది. జాలేసి ఈ ఉపాయం చెప్పాం."

అమ్మమ్మ మెత్తబడింది. "సర్లెండి. ఏం చేస్తాం. ఇంతకీ అట్టు ఎంతేంటీ?" అడిగింది.

"అర్ధణా" చెప్పారు తాతయ్య.

"హమ్మో! అట్టుముక్క అర్ధణానా? ఇంకేమైనా ఉందీ. ఓ ప్రక్క సామ్రాజ్యం అర్ధణాకి రెండిడ్లీలు, కాణీకి మూడు పుణుకులూ ఇస్తుంటే ఇక్కడ ఇంత ధర నిర్ణయిస్తే ఎట్లా? ఎవరు కొంటారు?"

"అట్టు నువ్వు పోసే అట్టులా పేపరు కాయితంలా లేదులే. ఒక్కటి తింటే కడుపు నిండిపోతుంది" అనేసి నోరు జారారు.

"అంటే మీరూ తిన్నారా?" పట్టుకుంది అమ్మమ్మ.

"తినడం అంటే నాకోసం కాదు. నేనో ముక్కతిని బావుందని మెచ్చుకుంటే దాని వ్యాపారం బాగా సాగుతుందని" అన్నారు సమర్థించుకుంటూ.

సణుక్కుని ఊరుకుంది అమ్మమ్మ.

ఏదో ప్రచారంకోసం అట్టుముక్క తిన్నారేమోలే అని ఊరుకున్న అమ్మమ్మకు అలవాటు ప్రకారం పన్నెండు దాటేసరికల్లా 'అన్నమో రామచంద్రా' అని గొడవచేసే తాతయ్య రెండైనా నోరెత్తకపోవడంతో అనుమానం వచ్చింది.

"ఏవిటి విశేషాలు. రోజూ ఏదో నెపంమీద అటుపోయి అట్టుముక్కలు తినొస్తున్నారా?" అని నిలదీసి అడిగేసింది.

ముందు నసిగినా చివరికి ఒప్పుకున్నారు.

"శ్రీరామచంద్రా! మీ తండ్రిగారి సమయంలో ఉన్న శ్రీచక్రార్చన ఎలాగూ గాలికొదిలేశారు. ఇక ఇప్పుడు పలహారాలు చేసి సంధ్యావందనం చేస్తారా? పాపం కాదుటండీ" అని లబలబలాడింది.

"ఏం పాపం కాదుట. ఆరోగ్యరీత్యా పనిచేస్తుందిట. హోమియో డాక్టరు చెప్పాడు. మన శాస్తుర్లు గారేమో పలహారం చేసినా ఫర్వాలేదు. పసుపు నీళ్ళు నెత్తిన జల్లుకొని 'పుండరీక్షా' అనుకుంటే దోషం పోతుంది అన్నారు" చెప్పారు తాతయ్య.

"బాగానే ఉంది సంబడం. అందరూ ఏకమైపోయారన్నమాట. ఇక నేనెంత నెత్తీ నోరూ బాదుకున్నా ఏం ప్రయోజనం?" అని వాపోయింది.

అమ్మ రాగానే ఇదంతా చెప్పుకుని బాధపడింది. అంతా విని "అమ్మయ్య -ఇంతకాలానికి మా నాన్నకి కష్టాలు గట్టెక్కాయి. ఇక నువ్వు దీపాలు పెట్టాక పొద్దుటి భోజనం పెట్టినా ఫర్వాలేదు" అంది అమ్మ నవ్వుతూ.

"అందరూ కలిసి నామీద పడి ఏడవటం తప్ప అవతల ఆచారం గంగలో కలిసిపోతుందని ఇసుమంతైనా బాధలేదేం ఎవరికీ" అని విసుక్కుంది.

"ఆ ఆచారాలు, సింగినాదాలూ నువ్వు పాటిస్తున్నావుగా-చాల్లే. మమ్మల్ని మా ఖర్మానికి వదిలెయ్" అంది అమ్మ.

"అంటే నువ్వు కూడా వెళ్ళి అట్టుముక్కలు తినొస్తావా?" ఆక్రోశించింది అమ్మమ్మ.

అన్నయ్యని పంపించి నాలుగు అట్లు తెప్పించింది అమ్మ.

అరిటాకులో చుట్టి ఇచ్చారు. దొడ్లో అరుగుమీద కూర్చుని తినడం ప్రారంభించింది. అమ్మమ్మ మాత్రం అంతదూరానే నిలబడింది చూస్తూ.

"నా మాట విని నువ్వూ ఓ ముక్క తిను" అంది అమ్మ ఆప్యాయంగా.

"చాల్లే తల్లీ. ఏనాడో చేసిన పాపాలకి ఇప్పుడనుభవిస్తున్నది చాలు. ఇంకా ఇంకా పాపం మూట కట్టుకోలేను. అటువైపుకి కూడా రాను" అంది విసురుగా.

అన్నదేగానీ ఆ చుట్టుపక్కలే తచ్చాడుతూ ఉంది.

"బాగానే ఉన్నాయి అట్లు. రెండు వైపులా ఎర్రెర్రగా కాల్చినట్లుంది. ఏం పచ్చడేంటి ఘుమఘుమలాడిపోతోంది. ఆచారాలు గాలికొదిలేస్తే అంతా ఆనందమే. కానీయండి తినండి" అంటూనే ఉంది.

అమ్మ ఉన్న నాల్రోజులూ రోజూ అట్లు తెప్పించుకు తిన్నాం. వెళ్తూ అమ్మ తాతయ్య చేతిలో ఖర్చులకుంటాయి ఉంచండి అంటూ పది రూపాయలు పెట్టింది.

"హరి భగవంతుడా! చివరికి ఆడపిల్ల దగ్గర డబ్బు తీసుకుంటున్నారా అట్టు ముక్కలకి?" అంది అమ్మమ్మ.

"నాకు కూతురైనా కొడుకైనా అదే కదా! దోషం లేదు" అన్నారు తాతయ్య. వారం రోజులు గడిచాయి. ఒకరోజు అమ్మమ్మ నన్ను పిలిచింది. "అమ్మడూ, నాకు ఒంట్లో బాగుండటంలేదే. మెడ నరాలు లాగేస్తున్నాయి. చేతులూ కాళ్ళూ ఒకటే పీకులు. చెవుల్లో ఒకటే హోరు. ఈమధ్య మీ తాతయ్య పూలరంగడిలా ఉన్నారు, చూస్తూనే

ఉన్నావు కదా! పోనీ ఓ అట్టు ముక్క తింటే నా రోగాలన్నీ కూడా తగ్గిపోతాయేమో. చూద్దావంటావా?" అంది మెల్లగా.

"ఓ! దానికేం భాగ్యం. రేపే తిని చూడు. అందులోనూ నీకని చెప్తే మరీ బాగా చేసిస్తుంది నరసమ్మత్తయ్య "అన్నానో లేదో నెత్తిన మొట్టింది.

"అదుగో! అదే మరి. నేను తిన్నానంటే అందరూ ఆక్షేపిస్తారు. నీకోసమే అని చెప్పి తీసుకురా. మీ అమ్మమ్మ కోసం అన్నావంటే నన్ను చంపుకుతిన్నంత ఒట్టు. జాగర్త మరి. వాకిట్లోంచీ వెళ్ళకు, దొడ్డిదారిన వెళ్ళు. గుట్టుగా చాటుగా తీసుకురావాలి. ఊరేగిస్తూ రాకూడదు" అని లక్ష జాగర్తలు చెప్పి, వంద ఒట్లు వేయించుకుంది.

మర్నాడు పొద్దున్నే బయలుదేరి వెళ్ళాను. దొడ్డి గుమ్మంగుండా నరసమ్మత్తయ్య ఇంట్లో అడుగుపెట్టిన నాకు అడుగు ముందుకి పడలేదు. వెనక వసారానిండా నాతోటి పిల్లలు. అందరూ నాలాగే దొంగట్లు తీసుకెళ్ళడానికే వచ్చారుట.

* * *